సాక్షి మహబూబాబాద్

మంగళవారం | 19 | ఆగస్టు | 2025



స్వర్ణోత్సవంలోకి కేయూ..

రాష్ట్రంలో ఉస్మానియా తర్వాత ప్రతిష్టాత్మక యూనివర్సిటీగా గుర్తింపు పొందిన కాకతీయ యూనివర్సిటీ నేటితో 50వ వసంతంలోకి అడుగిడబోతోంది.

- 8లో▸



ప్రథమ స్థానంలో నిలుపుతా..

పర్యాటక రంగంలో ములుగు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
33.7°/22.9°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హరియాణా విద్యార్థినికి మొదటి అడ్మిషన్



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికిగాను ఆల్ ఇండియా కోటలో హరియాణాకు చెందిన వైభవిసోని ఎంబీబీఎస్‌లో మొదటి అడ్మిషన్ పొందారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ లకావత్ విద్యార్థినికి సోమవారం అడ్మిషన్ పత్రం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఇంటర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్‌లో ఎంఎస్సీ, బీఎస్సీ చేసిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 63010 71295 ద్వారా సంప్రదించాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి




మహబూబాబాద్ అర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నూతన జిల్లా కమిటీ సభ్యులతో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు. నూతన జిల్లా కమిటీ సభ్యులు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకటి మహేష్, గడ్డం అశోక్, మదన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్ సుందర్‌శర్మ, చెల్పూరి వెంకన్న, సురేందర్, నరసింహారెడ్డి, పద్మ, దేవిక, సింగారపు సతీష్, ఇందుభారతి, నాగరాజు, మణిచందన, అశోక్, విష్ణువర్ధన్, సందీప్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు



మహబూబాబాద్ అర్బన్: జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థినులు పతకాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు తెలిపారు. పతకాలు సాధించిన మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ బాలికలను ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు మాట్లాడుతూ.. ఇటీవల జనగామ జిల్లాలో నిర్వహించిన 4వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలో పాఠశాల నుంచి పాల్గొన్న బాలికలు 7 బంగారు పతకాలు, రెండు రజత పతకాలు సాధించారని తెలిపారు. కోచ్ జావిద్, పీడీ సింధువర్మ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కరాటే పతకాలు పొందిన విద్యార్థినులు కీర్తన, విష్ణవి, రూబిన, నిహారిక, రిశ్విత, దీపా, పావని, గీత, భార్గవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మక్క సాగర్ 59 గేట్లు ఎత్తివేత



కన్నాయిగూడెం: మండల పరిధిలోని తుపాకులగూడెం గ్రామ పరిధిలోని సమ్మక్క సాగర్ బ్యారేజీకి గోదావరి వరద క్రమేపీ పెరుగుతూ వస్తోంది. బ్యారేజీలోకి ఎగువన ఉన్న సరస్వతీ, లక్ష్మి బ్యారేజీ నుంచి 4,98,280 క్యూసెక్కుల నీటి ప్రవాహం సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజీ 59 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ నీటిమట్టం సామర్థ్యం 83 మీటర్లు కాగా ప్రస్తుతం 80.30 మీటర్ల నీటిమట్టం ఉంది.

బస్తా కోసం కుస్తీ!

యూరియా అందక రైతుల నిరీక్షణ
- అవసరంలో సగమే సరఫరా
- ఆందోళన బాటపట్టిన అన్నదాతలు
- రైతు సంఘాలు, పార్టీల మద్దతు



మహబూబాబాద్ రూరల్ : మానుకోట పీఏసీఎస్ వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

సాక్షి, మహబూబాబాద్ : వానాకాలం పంటల సాగు కాస్తా ఆలస్యంగా ప్రారంభమైనా.. ఎట్టకేలకు సాగు అంచనా దిశగా ముందుకు సాగుతోంది. అయితే రోజుల తరబడి వేచి ఉంటే తప్పా బస్తా యూరియా దొరికే పరిస్థితి లేదు. దీంతో విసిగి వేసారిన రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి వచ్చింది.. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాల్సిన అధికారులు సరఫరా లేదని చేతులెత్తేస్తుండడంతో రైతులు అసహనానికి గురవుతున్నారు.

పెరుగుతున్న సాగు..

ఈ సీజన్‌లో వర్షాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో పత్తిసాగు కాస్తతగ్గి.. మొక్కజొన్న సాగు పెరిగింది. వరి సాగు ఇటీవల వర్షాలతో పుంజుకుంది. ఈ వానాకాలం సీజన్‌లో 4,29,790 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అంచనాలు వేశారు. ఇందులో పత్తి 84,854 ఎకరాలకుగాను 78,797 ఎకరాలు, మొక్కజొన్న 52,249 ఎకరాలకు 57,264 ఎకరాల్లో సాగు చేశారు. వరి 2,21,282 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 1,78,309 ఎకరాల్లో సాగైంది. ఈ నెలాఖరు వరకు మరో 50 వేల ఎకరాల్లో నాట్లు వేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం 4,21,301 ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సి ఉండగా 3,20,054 ఎకరాల్లో సాగుచేశారు.

పెరిగిన వినియోగం.. తగ్గిన సరఫరా

రోజు రోజుకు యూరియా వాడకం పెరుగుతూ వస్తుంది. కానీ ప్రభుత్వం మాత్రం ప్రణాళికలో పేర్కొన్న విధంగా సరఫరా చేయడం లేదు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం వరి, పత్తిలో ఎకరానికి రెండు బస్తాల యూరియా వేయాల్సి ఉండగా నాలుగు బస్తాలు వినియోగిస్తున్నారు. మొక్కజొన్నకు ఎకరానికి 2 నుంచి 3 బస్తాలు వేయాల్సి ఉండగా 4 నుంచి 8 బస్తాల యూరియా వాడుతున్నారు. సరఫరా మాత్రం అందుకు తగ్గట్టుగా లేదు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాకు 29,701 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 17,901 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. జిల్లాకు సరఫరా కావాల్సిన యూరియా కన్నా 11,800 మెట్రిక్ టన్నులు తక్కువగా వచ్చింది.

తప్పని నిరీక్షణ

సకాలంలో యూరియా వేస్తేనే పంట ఏపుగా పెరుగుతుంది. దీంతో రైతులు పీఏసీఎస్, ఆగ్రోస్ ఇతర కేంద్రాల చుట్టూ తిరిగినా దొరకడం లేదు.



గూడూరు: రైతులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

పట్టాదారు పాస్ పుస్తకం తీసుకెళ్లి క్యూలో పెట్టి ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించినా చివరకు బస్తా యూరియా దొరకడం కష్టంగా మారింది. ఆరోజు స్టాక్ అయిపోతే.. మరుసటి రోజు ఉదయం నుంచి మళ్లీ క్యూ కట్టాల్సి వస్తుంది. ఇలా ఒక్క బస్తా యూరియా కోసం కుస్తీ పట్టి మూడు రోజులు తిరిగితే కానీ యూరియా దొరకడం లేదు. దీంతో విసిగి వేసారిన రైతులు ఆందోళన చేయడం, నిరసనలు చేసే పరిస్థితి నెలకొంది.

జిల్లా వ్యాప్తంగా సోమవారం రైతుల ఆందోళనలు ఇలా..

- **మహబూబాబాద్ రూరల్:** మానుకోట పీఏసీఎస్ ఎదుట సోమవారం 1000 నుంచి 1200 మంది రైతులు యూరియా కోసం తెల్లవారుజామున నుంచి ఎదురుచూశారు. కేవలం ఒక లారీలో 444 బస్తాలు మాత్రమే రావడంతో ఒకరికి ఒకటి చొప్పున ఇచ్చారు. మిగిలిన రైతులకు ఒకటి రెండు రోజుల్లో తెప్పించి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. రైతులకు అవసరమైన మేరకు యూరియా అందజేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు.
- **తొర్రూరు:** యూరియా సరిపడా అందించడం లేదంటూ సోమవారం డివిజన్ కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన తెలిపారు. యూరియా కావాలంటే ప్రైవేట్ షాపుల యజమానులు ఇతర ఎరువులు కొనాలని లింకు పెడుతున్నారని వాపోయారు.

జిల్లాకు వచ్చిన యూరియా (మెట్రిక్ టన్నుల్లో)		
నెల	కావాల్సింది	సరఫరా
ఏప్రిల్	542	4,237
మే	434	1,780
జూన్	2,710	2,917
జూలై	10,840	5,241
ఆగస్టు	15,175	3,726 → (ఇప్పటి వరకు)
మొత్తం	29,701	17,901

- **నెల్లికుదురు:** సోమవారం యూరియా బస్తాలు వస్తాయని రైతులకు చెప్పిన సొసైటీ అధికారులు తీరా.. ఉదయం సొసైటీ వద్దకు అన్నదాతలు వచ్చిన తర్వాత ఈరోజు బస్తారు రావడంలేదని చెప్పారు. దీంతో రైతులు నెల్లికుదురు మహబూబాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు.
- **గూడూరు:** రైతులు ఉదయం 5 గంటలకే పీఏసీఎస్ కార్యాలయం చేరుకున్నారు. గంట సేపు రైతులు వేచిఉన్న తర్వాత ఈరోజు యూరియా రాదని సిబ్బంది చెప్పడంతో రైతులంతా జాతీయ రహదారిపైకి చేరుకొని బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- **నర్సింహులపేట:** యూరియా ఎదురు చూస్తున్న రైతులకు సోమవారం యూరియా రావడంలేదని తెలిసి పీఏసీఎస్ కార్యాలయం ఎదుట, అంబేడ్కర్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించారు. బీజేపీ మండల నాయకులు సైతం సొసైటీ వద్ద ఆందోళన చేశారు. సొసైటీలో యూరియా రాకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు ఇతర ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తున్నారని రైతులు వాపోయారు.
- **నెహ్రూసెంటర్:** రైతుల పంటలకు అవసరమైన యూరియా వెంటనే సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎస్పీ, అదనపు కలెక్టర్

మహబూబాబాద్: రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెక్రటేరియట్ నుంచి సీఎస్ రామకృష్ణారావుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా యూరియా కొరత, ఎరువుల లభ్యతపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. యూరియా, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, అధికారులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన కల్పించాలి : కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే యూరియా అమ్మకాలు చేపట్టాలన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు యూరియా అమ్మకాలు చేపట్టాలన్నారు. వర్షాలు, వరదలు పెరిగే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ.. జిల్లాలో రైతులకు ఇబ్బంది కలుగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. వీసీలో డీఏఓ విజయనిర్మల, డీసీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలి

- పార్లమెంట్ హౌస్ బయట నిరసన తెలిపిన ఎంపీ బలరాంనాయక్



నిరసనలో మాట్లాడుతున్న బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన 3.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ హౌస్ ఎదుట తెలంగాణ కాంగ్రెస్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ నిరసనలో ఎంపీ పోరిక బలరాంనాయక్ పాల్గొని మాట్లాడారు. యూరియా పంపిణీపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసి విన్నవించినా.. యూరియా కొరతను తీర్చలేదన్నారు. మంగళవారం పార్లమెంట్లో వాయిదా తీర్మానం ఇస్తామని తెలిపారు. మకర్ ద్వార్ వద్ద నిరసన తెలపనున్నామని, రైతుల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాడుతుందని తెలిపారు.

మెకానికల్ వాకింగ్ రోబోట్..

- తయారు చేసిన కేసముద్రం స్టేషన్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



రోబోట్‌ను తయారు చేసిన విద్యార్థులు

కేసముద్రం: కేసముద్రం స్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 8వ తరగతి విద్యార్థులు గణేష్, కల్యాణ్, పవన్, అరవింద్ మెకానికల్ వాకింగ్ రోబోట్ తయారు చేసి, సోమవారం ప్రదర్శించారు. పీఎం శ్రీకి ఎంపికైన ఈ పాఠశాలకు ఇటీవల అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) మంజూరైంది. ఈ మేరకు ల్యాబ్‌కు త్రీడీ ప్రింటర్స్, ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి పలు పరికరాలు వచ్చాయి. గైడ్ టీచర్ విజయ్ చందర్, మధు సహకారంతో విద్యార్థులు రోబోట్ అసెంబ్లింగ్ చేయడం నేర్చుకున్నారు. కాగా, మెకానికల్ వాకింగ్ రోబోట్ నడుస్తుంటే తోటి విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

నెహ్రూసెంటర్: సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సూచించారు. సోమవారం ఆయన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు అందించే ఆహారం రుచికరంగా ఉండాలని తెలిపారు. ఆస్పత్రిలో అత్యవసర సేవలతోపాటు కావాల్సిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పంచాయతీరాజ్, మున్సిపల్, అన్ని విభాగాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ జగదీశ్ ఉన్నారు.

సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

మహబూబాబాద్: సర్దార్ సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పో అన్నారు. సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో సోమవారం అధికారికంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ.. గొప్ప పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించి ఆదర్శంగా నిలిచిన మహోన్నతవ్యక్తి అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహస్వామి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక బోధన చేయాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధ్యాయులు బోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయులకు డిజిటల్ లిటరసీ, ఏఐ పై సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నవీన పద్ధతుల్లో విద్యబోధనను ప్రవేశపెడుతుందని తెలిపారు. సాంకేతిక అక్షరాస్యత, ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ విద్యా బోధన చేసేందుకు రాష్ట్రస్థాయిలో ఐదుగురు ఉపాధ్యాయులకు శిక్షణ అందించామన్నారు. వారు జిల్లాలో 60 కాంప్లెక్స్ పాఠశాల స్థాయి నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున మొత్తం 120 మంది ఉపాధ్యాయులకు జిల్లాలో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ ఆజాద్ చంద్రశేఖర్, విద్యాశాఖ అధికారులు సంతోష్, అప్పారావు, ఏఎస్‌సీ, డీఆర్‌పీలు సంపత్, అశోక్, జగన్, యాదగిరి, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

సీడీఎఫ్ పనులు వేగవంతం

- 80 శాతం పనులు పూర్తి
- తీరిన పలు సమస్యలు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) ఆవరణలో సీడీఎఫ్ నిధులతో నిర్మించిన వాకింగ్ ట్రాక్

మహబూబాబాద్: ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల స్పెషల్‌డవలప్‌మెంట్ ఫండ్ విడుదల చేసింది. దాంతో నియోజకవర్గంలోని పలు సమస్యలతోపాటు తాగు నీరు, విద్యకు సంబంధించిన పనులు చాలా వరకు పూర్తి చేశారు. నిబంధనల ప్రకారం పలు పనులకు నిధులు కేటాయించారు. ఈనిధుల విడుదలతో ఎమ్మెల్యేలకు కొంత ఊరట లభించినట్టైంది.

జిల్లాలో ఐదు నియోజకవర్గాలు

జిల్లా పరిధిలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయి. కానీ, మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాలు మాత్రమే పూర్తిస్థాయిలో ఉన్నాయి. నియోజకవర్గాలకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.10 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. సీపీఓ శాఖ నుంచి ఆ పనులకు సంబంధించిన నిబంధనలను ఎమ్మెల్యేలకు అందచేశారు.

ఖర్చు చేయాల్సింది ఇలా..

రూ 6.50 కోట్లు అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంది. రోడ్డులు, డ్రెయినేజీ, వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు ఇతరత్రా పనులు చేయొచ్చు. కోటి రూపాయలు మాత్రం తాగు నీటికి మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంది. రూ.రెండు కోట్లు ఎడ్యుకేషన్‌కు ఖర్చు చేయాలి. రూ.50 లక్షలు ప్రభుత్వ కార్యాలయాలకు ఖర్చు చేయాలనే నిబంధనలను ప్రభుత్వం రూపొందించింది. ఈ నిధుల ఖర్చు, పనులపై ఎమ్మెల్యేలదే పూర్తి అధికారం.

బ్యాలెన్స్ రూ.2.50 కోట్లు

మానుకోట నియోజకవర్గంలో రూ.6.50 కోట్ల పనుల్లో 143 పనులు పూర్తి చేశారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో కూడా రోడ్డులు, డ్రెయినేజీలు, వాకింగ్ ట్రాక్ పనులు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) ఎన్టీఆర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. గ్రామాల్లో కూడా అవే పనులు చేశారు. చాలా వరకు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. 143 పనులకు గాను రూ.5.37 కోట్లు ఖర్చు అయినట్లు సీపీఓ అధికారులు పేర్కొన్నారు. ఇంకా రూ.1.13 లక్షల బ్యాలెన్స్ ఉందని తెలిపారు. తాగు నీటికి సంబంధించి కోటి రూపాయలతో పనులు పూర్తి చేశారు. ఎడ్యుకేషన్‌కు రూ.2కోట్లలో రూ.66 లక్షల పనులు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల రూ.50 లక్షల్లో రూ.45 లక్షల పనులు చేశారు. మొత్తం పనులు 189 చేయగా రూ.7.48 కోట్లు ఖర్చు అయ్యాయని రూ.2.52 కోట్ల బ్యాలెన్స్ ఉందని సీపీఓ అధికారులు తెలిపారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్ నియోజకవర్గంలో రూ.6.50 కోట్ల పనుల్లో రూ.6.44 కోట్ల పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. తాగు నీటికి సంబంధించి కోటి రూపాయల పనులు పూర్తి చేశారు. ఎడ్యుకేషన్ రూ.రెండు కోట్లలో 45 పనులు పూర్తి చేశారు. బ్యాలెన్స్ లేదు. ప్రభుత్వ కార్యాలయాల రూ.50 లక్షల్లో రూ.35 లక్షల పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రూ.15 లక్షల బ్యాలెన్స్ ఉంది. మొత్తం 254 పనులు చేయగా రూ.9.79 కోట్లు ఖర్చు అయినట్లు అధికారులు తెలిపారు. మరో రూ.21 లక్షల బ్యాలెన్స్ ఉంది.

మళ్లీ ఎదురుచూపు

2025–26 సీడీఎఫ్ నిధుల కోసం ఎమ్మెల్యేలు ఎదురుచూస్తున్నారు. అవి విడుదలైతే నియోజకవర్గాల్లో పెండింగ్ పనులు చేయొచ్చనే ఆలోచనలో ఉన్నారు. ప్రజలు చిన్న చిన్న సమస్యలు చెప్పినప్పుడు వెంటనే ఎమ్మెల్యేలు పరిష్కరించేందుకు మళ్లీ విడుదల చేసే నిధులు ఉపయోగపడుతాయి.

ఖాళీ బిందెలతో నిరసన



కేసముద్రం : వారంరోజులుగా తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కేసముద్రంవిలేజ్ శివారు చైతన్యనగర్ కాలనీలో సోమవారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజు, కాలనీవాసులు మాట్లాడుతూ.. చైతన్యనగర్ కాలనీలో వారంరోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటిని అందించాలని వారు డిమాండ్ చేశారు. కొమ్ము రమాదేవి, మౌనిక, కలమ్మ, దివ్య, పద్మ, ఎల్లమ్మ, వల్లందాసు ఎల్లమ్మ, అమృత, సంగీత పాల్గొన్నారు.

జాతీయ విపత్తులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ అధికారులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ విపత్తులపై విద్యార్థులకు ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో పదో బెటాలియన్ టీం కమాండ్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూకంపాలు, రైలు ప్రమాదాలు, భారీ వర్షాలు సంభవించినప్పుడు ప్రాణనష్టం జరగకుండా ప్రమాదబారిన పడిన వారిని రక్షించాలని, పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక దళం వంటి వివిధ అత్యవసర సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆకస్మాత్తుగా మంటలు, వరదలు, అగ్ని, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండి బాధితులకు సాయం అందించాలని తెలిపారు. లేదంటే 100, 108, 101, ఫైర్ ఇతర నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మణ్‌నాయక్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ కాస్టుల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

భూపాలపల్లి అర్బన్: వర్షం కారణంగా భూపాలపల్లి ఏరియాలోని రెండు ఓపెన్ కాస్టుల్లో సోమవారం బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా సోమవారం మూడు షిఫ్టులో కేటీకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్–2, 3లలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. సుమారు 8వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని నిలిచిపోయింది. ఓపెన్ కాస్టులో రోడ్లని బురదమయంగా మారాయి. ఓపెన్‌కాస్టులోని పని స్థలాల్లో చేరిన వరద నీటిని ఎప్పటికప్పుడు తోడిపోసేందుకు అధికారులు భారీ సామర్థ్యం కలిగిన మోటార్లు ఏర్పాటు చేశారు.

బాలికపై లైంగికదాడికి పాల్పడిన నేరస్తుడికి ఇరవై ఏళ్ల జైలు



వరంగల్‌ లీగల్‌: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నేరస్తుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 15 వేల జరిమానా విధిస్తూ ఒకటో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అపర్ణాదేవి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్‌ కథనం ప్రకారం.. మహబూబాబాద్‌ జిల్లా చిన్న గూడూరు మండలం బయ్యారం చిన్న తండాకు చెందిన ఓ మహిళ బతుకుదెరువు నిమిత్తం కాజీపేట డీజిల్‌ కాలనీ ప్రాంతానికి వచ్చి ఇక్కడే మొక్క జొన్న కంకులు కాల్చి విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈమెకు నలుగురు కూతుళ్లు ఉండగా ముగ్గురికి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కూతురు ఏడో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. అప్పుడప్పుడు తల్లి వద్దకు వచ్చి పనులు చేస్తూ చేదోవాదోడుగా ఉండేది. ఈక్రమంలో పర్వతగిరి మండలం అన్నారం తండా చెందిన వాంకుడోత్‌ చంద్రుడు.. ఆ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. 2022, డిసెంబర్‌ 15న రాత్రి ఫోన్‌ చేసి బాలికకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం సదరు బాలికను రోడ్డుపై వదిలేసి వెళ్లాడు. ఈవిషయమై ఎవరికైనా చెబితే నీవు నాతో తీసుకున్న ఫొటోలు అందరికీ చూపిస్తానని భయపెట్టాడు. ఈ ఘటనపై బాలిక తల్లి కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ మహేందర్‌ రెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రస్తుత ఇన్‌స్పెక్టర్‌ వై.సుధాకర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్‌ ఏరుకొండ సుధాకర్‌, కోర్టు లైజన్‌ ఆఫీసర్‌, ఏఎస్సై పరమేశ్వరి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి అపర్ణాదేవి.. నేరస్తుడు వాంకుడోత్‌ చంద్రుడుకు 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- కొత్తగట్టు సింగారం స్టేజీ వద్ద ఘటన


ఘటనాస్థలిలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై పరమేశ్‌

శాయంపేట : ఆగి ఉన్న లారీని ఓ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండలంలోని కొత్తగట్టు సింగారం స్టేజీ వద్ద చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌, పోలీసుల కథనం ప్రకారం.. టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన ఎం.డి గౌసొద్దీన్‌ భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం శివారులో ఓ లారీని రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా నిలిపి ఉంచారు. ఇదే సమయంలో హనుమకొండ నుంచి కాళేశ్వరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి లారీని ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతినడంతోపాటు ప్రయాణికులు రాజయ్య, సరోజన, వెంకటమ్మ, సౌజన్య, చంద్రయ్య, శివరుణ్‌, ఎల్లమ్మ, పవిత్ర, ఉమారాణి, పోషక్క, అమూల్యకు స్వల్ప గాయాలు కావడంతో 108లో ఎంజీఎం తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై జక్కుల పరమేశ్‌ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. అనంతరం బస్సు డ్రైవర్‌ గౌసొద్దీన్‌ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌ అబ్దుల్‌ ఖాయమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనలో ప్రయాణికులకు స్వల్ప గాయాలై పెనుప్రమాదం నుంచి తప్పించుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ దాడి

ఖిలా వరంగల్‌: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ అధికారులు దాడి చేసి రూ.12 970 నగదు, 4 మొబైల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ సార్ల రాజు తెలిపారు. వరంగల్‌ ఏనుమాముల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పేకాట ఆడుతున్న బొందుగుల అఖిల్‌, జడల సాగర్‌, నమిండ్ల కర్ణాకర్‌, ఇమ్మడి హర్షపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం ఏనుమాముల పోలీస్‌ స్టేషన్‌కు కేసును అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్‌ రాజు వివరించారు.

స్వర్ణోత్సవంలోకి కేయూ..

యూనివర్సిటీ ఆవిర్భవించి 49 వసంతాలు పూర్తి

నేడు 50వ వసంతంలోకి..

- న్యాక్‌ ఏ ప్లస్‌ గ్రేడ్‌ సాధించినా సమస్యలే
- వేధిస్తున్న రెగ్యులర్‌ అధ్యాపకుల కొరత
- బోధన, పరిశోధనలపై తీవ్ర ప్రభావం
- పీజీ సెంటర్లను పట్టించుకునే నాథుడు కరువు


కేయూ పరిపాలన భవనం

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీ.. నిత్య చైతన్య దీప్తిగా ఉంటూ ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన చదువులమ్మ ఒడి. అంతేకాకుండా ఉద్యమాల గడ్డ.. పోరాటాల అడ్డాగా పేరొందింది. ఈ క్రమంలో యూనివర్సిటీ మంగళవారం 50వ వసంతంలోకి అడుగిడబోతోంది. రాష్ట్రంలో ఉస్మానియా తర్వాత ప్రతిష్టాత్మక యూనివర్సిటీగా కేయూ గుర్తింపు పొందింది. న్యాక్‌ ఏప్లస్‌ గ్రేడ్‌ సాధించి విద్యార్థుల ప్రాధాన్య యూనివర్సిటీగా మారింది. ఈ నేపథ్యంలో ఈనెల 19వ తేదీతో 49 సంవత్సరాలు పూర్తిచేసుకుని స్వర్ణోత్సవంలోకి అడుగుపెట్టబోతోంది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రస్థానం, ఇక్కడ నెలకొన్న సమస్యలు, కావాల్సిన సదుపాయాలపై 'సాక్షి' ప్రత్యేకథనం.

తొలుత ఓయూ పీజీ సెంటర్‌గా..

తొలుత ఉస్మానియా యూనివర్సిటీ పీజీ సెంటర్‌గా 1968లో ప్రారంభమైంది. 1976 ఆగస్టు 19న కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భవించింది. ఈ 49 ఏళ్లలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దింది. ఎంతో మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. అయితే ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన కేయూ.. నేడు అనేక సమస్యలతో సతమవుతోంది. పాఠాలు బోధించేందుకు వివిధ విభాగాల్లో రెగ్యులర్‌ ప్రొఫెసర్ల కొరత ఉంది. ఒకప్పుడు కేయూలో సీనియర్‌ ప్రొఫెసర్లతో విద్యతోపాటు పరిశోధనలు విస్తృతంగా జరిగేవి. ఇది అంతా గతం. తెలంగాణ ఆవిర్భావంతో యూనివర్సిటీ అభివృద్ధిలో పయనిస్తుందని భావించారు. కానీ సమస్యలు పరిష్కారం కాకపోగా గత ప్రభుత్వం ప్రైవేట్‌ యూనివర్సిటీలను తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విద్యావేత్తలు ఆరోపిస్తున్న విషయం విధితమే. కేయూ నిధుల లేమితో ఇంకా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

నాలుగు విభాగాలతో మొదలై.. 28 విభాగాల వరకు..

కాకతీయ యూనివర్సిటీ తొలుత నాలుగు విభాగాలతో మొదలై అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం 28 విభాగాలతో కొనసాగుతోంది. మూడు ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాలోని 11 జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ప్రభుత్వ, ఎయిడెడ్‌, ప్రైవేట్‌, అటానమస్‌ డిగ్రీ కళాశాలలు 211 ఉండగా, యూనివర్సిటీ పీజీ కళాశాలలు 74, ఇంజనీరింగ్‌ 6, ఫార్మసీ 25, ఎడ్యుకేషన్‌ 41, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ 3, 'లా' కళాశాలలు 3, ఎంబీఏ 24, ఎంసీఏ 7, హోటల్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాలలు 3 ఉన్నాయి. ఇటీవల కేయూ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్‌ ఇంజనీరింగ్‌ కాలేజీని ఎర్త్‌ యూనివర్సిటీగా ఏర్పాటు చేసిన విషయం విధితమే.

బోధన అంతంత మాత్రమే..

కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు బోధన అంతంతమాత్రంగానే ఉంటుంది. రెగ్యులర్‌ అసిస్టెంట్‌, అసోసియేట్‌, ప్రొఫెసర్లు కలిపి 77 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో కొందరికి రెండు, మూడు, నాలుగైదు పరిపాలన పదవులు కూడా ఉండడంతో వారు బోధనపై అంతగా దృష్టిసారించడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని విభాగాల్లో ఒక్క రెగ్యులర్‌ అధ్యాపకుడు కూడా లేరు. ఉదాహరణకు తెలుగు, పొలిటికల్‌ సైన్స్‌, విద్యా, ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ కళాశాలలు, సైకాలజీ, జర్నలిజం విభాగాలున్నాయి. ఎకనామిక్స్‌, హిస్టరీ, పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌, బాటనీలో విభాగాల్లో ఒక్కొక్కరే రెగ్యులర్‌ ప్రొఫెసర్‌ ఉన్నారు.

కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్లతోనే బోధన..

కేయూలో 176 మంది వరకు కాంట్రాక్టు లెక్చరర్లు, 183 మంది వరకు పార్ట్‌టైం లెక్చరర్లు ఉన్నారు. అయినా వివిధ విభాగాలు, యూనివర్సిటీ కాలేజీలో వర్క్‌లోడ్‌కు అనుగుణంగా ఇటీవలే పేపర్‌వైజ్‌గా విద్యాబోధనకు తాత్కాలిక పద్ధతిలో కొందరిని నియమించారు.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

కేయూలో ప్రధానంగా రెగ్యులర్‌ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. అన్ని విభాగాలు కలిపి (అసిస్టెంట్‌, అసోసియేట్‌, ప్రొఫెసర్‌) 409 పోస్టుల మంజూరు ఉండగా ప్రస్తుతం 77మంది అధ్యాపకులే ఉన్నారు.

పీజీ సెంటర్లను పట్టించుకునే వారేరి?

కేయూ పరిధిలోని పీజీ సెంటర్లను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. 2012–2013లో ఏర్పాటు చేసిన మహబూబాబాద్‌, జయశంకర్‌ భూపాలపల్లి, జనగామ జిల్లాలోని పీజీసెంటర్లలో ఒక్క రెగ్యులర్‌ లెక్చరర్‌ లేరు. ప్రిన్సిపాల్‌ కూడా లేరు. పేరుకు యూనివర్సిటీలోని వైస్‌ ప్రిన్సిపాల్‌కే ఇన్‌చార్జ్‌ అని ఇస్తున్నారు. కానీ వారు కూడా వెళ్లడం లేదు. బోధించేవారు అంతంత మాత్రమే. దీంతో అడ్మిషన్ల సంఖ్యతగ్గిపోతోంది. నిర్మల్‌ పీజీ సెంటర్‌ ఇప్పటికే మూతపడిందని భావిస్తున్నారు. ఖమ్మం పీజీ సెంటర్‌లో కూడా రెగ్యులర్‌ అధ్యాపకుల కొరత ఉంది.

నాన్‌ టీచింగ్‌ ఉద్యోగుల పోస్టులు కూడా వెకెన్సీలు

గెజిటెడ్‌ ఆఫీసర్స్‌ ఉద్యోగుల పోస్టులు 29కి 22మంది పనిచేస్తున్నారు. ఎన్‌జీఓ కేడర్‌ ఉద్యోగుల పోస్టుల మంజూరు 240 ఉండగా 115 వెకెన్సీలుగా ఉన్నాయి. క్లాస్‌ ఫోర్త్‌ ఎంప్లాయిస్‌ పోస్టులు మంజూరు 225 ఉండగా 78 మంది పనిచేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులు 507మంది పనిచేస్తున్నారు. కాగా, ఉద్యోగులకు ఫేస్‌రికగ్నైషన్‌ హాజరు వచ్చే నెలలో అమలు చేయాలని వీసీ ప్రతాప్‌రెడ్డి నిర్ణయించారు.

ఫీజుల భారం..

మూడేళ్లక్రితం కేయూలోని పీజీ, ప్రొఫెషనల్‌ ఎస్‌ఎఫ్‌సీల్లో అదనపు సీట్లు పెంచడంతోపాటు ఫీజులు కూడా భారీగా పెంచారు. అయితే ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌ కింద వర్సిటీకి రూ. 50కోట్లకు పైగానే బకాయిలు రావాల్సి ఉందని సమాచారం.

విద్యార్థుల ప్రధాన సమస్యలు..

కేయూలో ఎస్‌ఎఫ్‌సీలను రెగ్యులర్‌గా మార్చాలని విద్యార్థులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. అలాగే, విద్యార్థులకు హాస్టల్‌ వసతి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. హాస్టళ్ల భవనాలు సరిపడాలేకపోవడంతో విద్యార్థులు బయట ప్రైవేట్‌గా ఉంటుండడంతో ఆర్థిక భారం పడుతుంది. క్యాంపస్‌లోని రెండు ఇంజనీరింగ్‌ కాలేజీల్లోనూ రెగ్యులర్‌ అధ్యాపకుల నియమించాల్సింది. ఇంజనీరింగ్‌ విద్యార్థినులకు హాస్టల్‌ వసతి అవసరం ఉంది.

మౌలిక వసతులకు రూ. 300 కోట్లతో ప్రతిపాదనలు..



కాకతీయ యూనివర్సిటీ 50 వసంతంలోకి అడుగిడబోతుంది. దీంతో వచ్చే ఆగస్టు వరకు గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నాం. యూనివర్సిటీలో అకడమిక్‌, నాణ్యమైన పరిశోధనల పరంగా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అడుగులు వేయబోతున్నాం. ఇందులో భాగంగా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 300 కోట్లతో ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. – కె.ప్రతాప్‌రెడ్డి, వీసీ, కేయూ

పర్యాటకంలో ములుగును ప్రథమ స్థానంలో నిలుపుతా


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌ రమేశ్‌రెడ్డి

- రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి సీతక్క

ములుగు రూరల్‌: పర్యాటక రంగంలో ములుగు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి డాక్టర్‌ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఇంచర్ల నిర్మిస్తున్న ఎకో ఎత్నిక్‌ విలేజ్‌, పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌ పటేల్‌ రమేశ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామప్ప, లక్నవరం అభివృద్ధితో పాటు పర్యాటకులను ఆకర్షించేలా ఇతర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. రామప్ప, లక్నవరం, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర, బొగత జలపాతం, బ్లాక్‌ బెర్రీ, దట్టమైన అటవీ ప్రాంతాల్లో పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. జాతీయ రహదారికి సమీపంలో రూ. 37 కోట్లతో పర్యాటక స్థలంలో షాపింగ్‌ కాంప్లెక్స్‌, హ్యాపీ థియేటర్‌ ఏర్పాటు చేస్తామన్నారు. రామప్పలో రూ. 13 కోట్లతో ఐలాండ్‌ పనులు చేపడుతామన్నారు. అనంతరం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌ పటేల్‌ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ములుగు జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ మహేందర్‌జీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బానోత్‌ రవిచందర్‌, టూరిజంశాఖ అధికారి శివాజీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైంచ్‌ కేంద్రంలో పిల్లలకు సంరక్షణ..

క్రైంచ్‌ కేంద్రంలో పిల్లలకు సంరక్షణ ఉంటుందని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండలంలోని జగ్గన్నపేటలో అదనపు కలెక్టర్‌ మహేందర్‌జీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బానోత్‌ రవిచందర్‌తో కలిసి అంగన్‌ వాడీ, డే కేర్‌ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడారు.

మానుకోటలో చైన్‌ స్నాచింగ్‌

- వృద్ధురాలి మెడలోని ఐదున్నర తులాల బంగారు గొలుసు అపహరణ

మహబూబాబాద్‌ రూరల్‌: మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలో చైన్‌ స్నాచింగ్‌ జరిగింది. ఓ వృద్ధురాలి మెడలోని ఐదున్నర తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది. స్థానిక రైల్వే స్టేషన్‌ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్‌ జిల్లా కేంద్రానికి చెందిన వైద్యుడు బానోత్‌ అశోక్‌ తల్లి శాంతమ్మ ఈనెల 16వ తేదీన ఖమ్మంలో ఉంటున్న తన కుమార్తెలు పుష్పబాయి, హైమావతి ఇంటికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం ఇంటర్‌ సిటీ రైలులో మహబూబాబాద్‌ రైల్వే స్టేషన్‌లో దిగింది. డాక్టర్‌ అశోక్‌ రైల్వే స్టేషన్‌కు వచ్చి తల్లిని తీసుకెళ్తున్నారు. మూడో నంబర్‌ ప్లాట్‌ ఫామ్‌ చివరి ప్రాంతంలో ఆ వృద్ధురాలు నడిచి వెళ్తుండగా ఒక్కసారిగా ఓ ఆగంతకుడు అక్కడికి వచ్చి ఆమె మెడలోని ఐదున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. గమనించిన డాక్టర్‌ అశోక్‌ పరుగెత్తుకుంటూ ఆ అగంతకుడి వెంట వెళ్లి రైల్వే అండర్‌ బ్రిడ్జిపై భాగంలో కొంతసేపు వెతికినా ఫలితం లేకుండాపోయింది. ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా జీఆర్పీ ఎస్సై సురేశ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి మహిళ మృతి


గౌరమ్మ (ఫైల్‌)

ఎస్‌ఎస్‌తాడ్వాయి : వాగులో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన ములుగు జిల్లా ఎస్‌ఎస్‌ తాడ్వాయి మండలం కాల్వపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సొగలం గౌరమ్మ(45) మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కుటుంబీకులు తలుపులు తెరిచి నిద్రించారు. సోమవారం ఉదయం నిద్రలేచి చూడగా గౌరమ్మ కనిపించలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం గాలించగా ఇంటి సమీపంలో ఉన్న తూముల వాగులో పడి మృతి చెంది కనిపించింది. రాత్రి సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లి వాగులో పడి మృతి చెందిందనే కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పాపన్న గౌడ్‌ జయంతి రసాభాస


కలెక్టర్‌ రాకపోవడంపై అధికారులను ప్రశ్నిస్తున్న నాయకులు

- హనుమకొండ కలెక్టర్‌ రాకపోవడంపై బీసీల అసహనం


పాపన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్‌ స్నేహశబరీష్‌, బీసీ సంఘాల నాయకులు

హన్మకొండ: సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ జయంతి కార్యక్రమం రసాభాసగా సాగింది. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఆధికారికంగా పాపన్న గౌడ్‌ జయంతిని నిర్వహించింది. కలెక్టర్‌ స్నేహ శబరీష్‌ పాల్గొనకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. బీసీ సంఘం నాయకులు బొనగాని యాదగిరి గౌడ్‌, సుందర్‌ రాజ్‌ యాదవ్‌, ఇతర బీసీ నాయకులు మాట్లాడుతూ కలెక్టర్‌.. బీసీల పట్ల చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్‌ రావాల్సిందేనని అక్కడున్న అధికారులతో గొడవకు దిగారు. ఈ క్రమంలో జయంతి వేడుకలు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకేనని, కార్యక్రమం ముగిసిందని, ప్రజావాణి నిర్వహించాల్సి ఉందని అధికారులు తెలపగా, తాము కలెక్టరేట్‌ ముందు రోడ్డుపై జయంతి జరుపుకుంటామని, ఈ ఫొటోలు, సమాచారం సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపుతామని హెచ్చరించారు. గొడవ పెద్దదవుతుందని తెలియడంతో కలెక్టర్‌ స్నేహ శబరీష్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌కు చేరుకుని పాపన్న గౌడ్‌ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీంతో బీసీ సంఘాల నాయకులు శాంతించారు. సోమవారం గ్రీవెన్స్‌ ఉన్నందున ప్రజలకు ఇబ్బంది కలగరాదని ఉద్దేశంతో ఆలోగా కార్యక్రమం పూర్తి చేయాలని చెప్పామని, ఏదైనా విషయం ఉంటే రాతపూర్వకంగా ఇవ్వండని బీసీ సంఘాల నాయకులకు కలెక్టర్‌ సూచించినట్లు సమాచారం. అనంతరం బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేశ్‌, డీఆర్‌డీఓ మేన శ్రీను, ఆర్డీఓలు రాథోడ్‌ రమేశ్‌, డాక్టర్‌ కె.నారాయణ, జిల్లా బీసీ సంక్షేమాధికారి లక్ష్మణ్‌, బీసీ సంఘాల నాయకులు చిర్ర రాజు, శ్యామ్‌ యాదవ్‌, జనగామ శ్రీనివాస్‌ గౌడ్‌, మార్క విజయ్‌ గౌడ్‌, రామస్వామి గౌడ్‌, బూర విద్యాసాగర్‌, మౌనిక, తది తరులు పాల్గొన్నారు.

ఎన్‌డీలో మరో సంక్షోభం..

- ఇప్పటికే వర్గాలుగా చీలిపోయిన విప్లవ పార్టీలో మరో చీలిక
- చంద్రన్న వర్గానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన రాష్ట్ర కార్యదర్శి అశోక్‌
- న్యూడెమోక్రసీగానే కొనసాగుతామని ప్రకటన


మాట్లాడుతున్న ఎన్‌డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌

బయ్యారం: ఒకప్పుడు ఇల్లందు నియోజకవర్గాన్ని పెట్టనికోటగా మార్చుకున్న న్యూడెమోక్రసీ(ఎన్‌డీ)లో మరో సంక్షోభం తలెత్తింది. ఫలితంగా కాలక్రమేణా వస్తున్న చీలికలతో ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి వచ్చింది. తాజాగా న్యూడెమోక్రసీ (చంద్రన్నవర్గం) రాష్ట్ర కార్యదర్శి అశోక్‌.. కొందరు నాయకులతో కలిసి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ విషయం సంచలనంగా మారింది. అయితే చంద్రన్న వర్గానికి రాజీనామా చేసినా తాము న్యూడెమోక్రసీగానే కొనసాగుతామని అశోక్‌ ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో మరో విప్లవగ్రూపు ఆవిర్భవించినట్లు భావించొచ్చు. బయ్యారంలోని వీబీటీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఖమ్మం–వరంగల్‌ ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర కమిటీ కార్యదర్శి స్థాయిలో పనిచేస్తున్న పెద్దచంద్రన్న వ్యక్తిగత నిర్ణయాలు, విప్లవేతర పనులు పార్టీ మనుగడకే ప్రమాదకరంగా మారాయన్నారు. ఈ క్రమంలో పార్టీ కమిటీల సమావేశాలకు తగిన సమయం ఇవ్వలేని స్థితి ఏర్పడడంతో చంద్రన్నవర్గానికి రాజీనామా చేశామన్నారు. ప్రస్తుతం ప్రజాసమస్యల పరిష్కారంపై విప్లవ సంస్థలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉండడంతో తాము భవిష్యత్‌లో విప్లవ సంస్థల ఐక్యతకు అనుకూలంగా ఉంటామన్నారు. చంద్రన్నవర్గానికి రాజీనామా ప్రకటించిన వారిలో భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లా కార్యదర్శులు ఊక్లా, శ్రీనివాస్‌, రాష్ట్ర, జిల్లా నాయకులు మదార్‌, కోటమ్మ, పాపారావు, వెంకటేశ్వర్లు, హనుమంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చిన్నలింగయ్య, షర్ఫొద్దీన్‌, వెంకన్న, నర్సిరెడ్డి, కవిత, బాలయ్య, రాంసింగ్‌, దేవేందర్‌ తదితరులున్నారు.

ప్రజాపంథా నుంచి చీలికలు.. చీలికలుగా..

ఇల్లందు నియోజకవర్గంలో కొన్ని దశాబ్దాల క్రితం ప్రజాపంథా విప్లవగ్రూపు బలమైన పునాది ఏర్పర్చుకుంది. ఆ పార్టీ తరఫున గుమ్మడి నర్సయ్య ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుపెట్టారు. ఆ తర్వాత ప్రజాపంథా పార్టీ పేరును న్యూడెమోక్రసీగా మార్చారు. కాలక్రమేణా ఆ పార్టీలో వచ్చిన సిద్ధాంత విభేదాలతో న్యూడెమోక్రసీ రాయల, చంద్రన్న వర్గాలుగా విడిపోయింది. అనంతరం రాయలవర్గంలో ఏర్పడిన చీలికలో ఒక వర్గం మాస్‌లైన్‌ (ప్రజాపంథా) పార్టీని ఏర్పాటు చేయగా మరోవర్గం న్యూడెమోక్రసీ(యతీంద్రకుమార్‌వర్గం)గా కొనసాగుతోంది. ఆ తర్వాత చంద్రన్నవర్గంలో ఏర్పడిన చీలికలో బయటకు వచ్చిన నాయకులు యతీంద్ర కుమార్‌ వర్గంలో చేరగా తాజాగా అశోక్‌ నాయకత్వంలో ఏర్పడిన చీలికవర్గం తాము న్యూడెమోక్రసీగానే కొనసాగుతామని ప్రకటించడంతో ఇప్పటికే రాష్ట్రంలో రెండు న్యూడెమోక్రసీలు ఉండగా కొత్తగా మరోటి ఏర్పడనుంది. రానున్న రోజుల్లో కొత్తగా ఏర్పడే న్యూడెమోక్రసీ మరోవర్గంలో విలీనమవుతుందా లేక పార్టీగా కొనసాగుతుందా అనే అంశం భవిష్యత్‌లో తేలనుంది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు వివాహేతర సంబంధం

- విషయం తెలిసి సదరు మహిళ భర్త బలవన్మరణం
- ఘటనలో ఉపాధ్యాయుడి అరెస్ట్‌

వాజేడు: మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమె భర్త మృతికి కారణమైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కటకటాల పాలయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలురుపాడు మండలం సూర్యాతండాకు చెందిన వాంకుడోత్‌ బావుసింగ్‌ ములుగు జిల్లా వాజేడు మండలం బిజినేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో జూలురుపాడుకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడి అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం సదరు మహిళ భర్తకు తెలియడంతో అతను సూసైడ్‌ నోట్‌ రాసి సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సూసైడ్‌ నోట్‌, సెల్ఫీ వీడియో ఆధారంగా కేసు నమోదు చేసిన కొత్తగూడెం పోలీసులు సదరు ఉపాధ్యాయుడిని ఈనెల 11వ తేదీన అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంఈఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా బావుసింగ్‌ను అరెస్ట్‌ చేసిన మాట వాస్తమే కాని తనకు, జిల్లా విద్యాశాఖకు ఎలాంటి సమాచారం లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ దృష్టా సమీపంలోని మొరుమూరు పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయుడిని బిజినేపల్లి పాఠశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు.

యూరియా వచ్చేసింది..


- వ్యాగన్‌లో రైల్వే గూడ్స్‌ షెడ్‌కు చేరిన యూరియా
- మార్క్‌ఫెడ్‌, ఫర్టిలైజర్‌ షాపులకు సరఫరా


గూడ్స్‌ షెడ్‌ నుంచి లారీలో తరలిస్తున్న యూరియా

ఖిలా వరంగల్‌ : వరంగల్‌ రైల్వేస్టేషన్‌లోని గూడ్స్‌ షెడ్‌కు సోమవారం యూరియా చేరింది. దీంతో యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఊరట లభించింది. ఉమ్మడి జిల్లాలోని రైతులకు అందించేందుకు 1500.750 మెట్రిక్‌ టన్నుల క్రిబ్‌కో కంపెనీకి చెందిన యూరియా వచ్చింది. ఈ యూరియాను మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, ఇతర ఫర్టిలైజర్‌ షాపులకు 40 శాతం కేటాయించారు. సోమవారం ఉదయం నుంచే వరంగల్‌ గూడ్స్‌ షెడ్‌ నుంచి ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌, ఫర్టిలైజర్‌ షాపులకు తరలించే ప్రక్రియ ప్రారంభించామని వ్యవసాయ అధికారి రవీందర్‌ రెడ్డి తెలిపారు.

కొండపల్లిలో తాత్కాలికంగా హాల్టింగ్‌ ఎత్తివేత

- అక్టోబర్‌ నుంచి అమల్లోకి..



కాజీపేట రూరల్‌ : ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి మరమ్మతు కారణంగా కాజీపేట జంక్షన్‌, వరంగల్‌ మీదుగా ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్‌ రైళ్లకు అక్టోబర్‌ నుంచి కాజీపేట–విజయవాడ మధ్య గల కొండపల్లి రైల్వే స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్‌ ఎత్తివేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్‌ సోమవారం తెలిపారు.

తాత్కాలికంగా హాల్టింగ్‌ ఎత్తివేసిన రైళ్లు ఇవే..

అక్టోబర్‌ 19 నుంచి నవంబర్‌ 11వ తేదీ వరకు మచిలీపట్నం–బీదర్‌ (12749) డైలీ ఎక్స్‌ప్రెస్‌, బీదర్‌–మచిలీపట్నం (12750) డైలీ ఎక్స్‌ప్రెస్‌, గుంటూరు–సికింద్రాబాద్‌ (17201) డైలీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌–గుంటూరు (17202) డైలీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌, అక్టోబర్‌ 18 నుంచి నవంబర్‌ 17వ తేదీ వరకు తిరుపతి–ఆదిలాబాద్‌ (17405) డైలీ కృష్ణాఎక్స్‌ప్రెస్‌, ఆదిలాబాద్‌–తిరుపతి (17406) కృష్ణాఎక్స్‌ప్రెస్‌, అదేవిధంగా అక్టోబర్‌ 19 నుంచి నవంబర్‌ 18వ తేదీ వరకు విజయవాడ–భద్రాచలం(67215) ప్యాసింజర్‌, భద్రాచలం–విజయవాడ (67216) ప్యాసింజర్‌, విజయవాడ–డోర్నకల్‌ (67768) ప్యాసింజర్లకు కొండపల్లిలో తాత్కాలికంగా హాల్టింగ్‌ ఎత్తివేసినట్లు సీపీఆర్వో ఎ. శ్రీధర్‌ తెలిపారు.

మేడిగడ్డకు కొనసాగుతున్న వరద


మేడిగడ్డ బ్యారేజీ వద్ద వరద

కాళేశ్వరం: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలంలో గోదావరి, ప్రాణహిత నదుల వరద కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతోంది. సోమవారం ఉదయం నుంచి తెలంగాణ, మహారాష్ట్ర వ్యాప్తంగా వర్షం కురుస్తుండడంతో వరద నిలకడగా ఉంది. కాళేశ్వరం త్రివేణి సంగమం 8.540 మీటర్ల ఎత్తులో నీటిమట్టం తరలుతోంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద 4.70లక్షల క్యూసెక్కులు తరలివస్తోంది. దీంతో అదే స్థాయిలో బ్యారేజీలోని మొత్తం 85 గేట్లు ఎత్తినీటిని దిగువకు వదులుతున్నారు.